## రేపు పరుగు పందెం పోటీలు

★ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

■ మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 13 : ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మెదక్ జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలను అండర్ –16, 18, 20 బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరునార్తి వెంకటరమణ, మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చినవారిని ఈ నెల 23న కామారెడ్డి జిల్లాలో జరిగే 9వ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9963005540 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## పశువులకు కృత్రిమ గర్భధారణ

■ చిలిపిచెడ్, జనవరి 13 : పశువులకు కృత్రిమ గర్భధారణతో పశుజాతి అభివృద్ధి చెందుతాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ కొండల్‌రెడ్డి అన్నారు. చిలిపిచెడ్ మండలం గూజిరితండాలో బుధవారం పశువులకు కృత్రిమ గర్భధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పశువులకు కృత్రిమ గర్భధారణ శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్, సర్పంచ్ రాకేశ్‌నాయక్, చిట్కుల్ పశువైద్యశాల అసిస్టెంట్ సురేశ్, గోపాల్‌మిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, అరవింద్‌చారి, గోపాలమిత్ర సిబ్బంది మానయ్య, విజయ్ పాల్గొన్నారు.

## ఈజీఎస్ పనులపై సమీక్ష

■ నిజాంపేట, డిసెంబర్ 13 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లతో కలిసి ఉపాధిహామీ పనులపై బుధవారం ఎంపీడీవో జగదీశ్వర్ సమీక్ష నిర్వహించారు. హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీలతోపాటు గ్రామ పంచాయతీలో ప్రతి పనికి ప్రత్యేక రికార్డును నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేందర్, ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

■ శివ్వంపేట, డిసెంబర్ 13 : రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి సూచించారు. శివ్వంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న రైతుభరోసా పథకానికి నూతనంగా పట్టా పాస్ బుక్కులు వచ్చిన రైతులు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్ ఏడీఏ వినయ్‌కుమార్, ఏవో లావణ్య, ఏఈవోలు భవాని, మౌనిక, రవి, మాజిద్, రైతులు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల సమ్మె..

■ పెద్దశంకరంపేట, డిసెంబర్ 13 : గ్రామీణ ప్రాంత తపాలా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పెద్దశంకరంపేటలోని తపాలాశాఖ కార్యాలయం వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేస్తూ పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీపీఎంలు మాణయ్య, గంగారాం, నెహ్రూ, విజయ్, ప్రశాంత్, బీరప్ప ఉన్నారు.

## కడీలు ధ్వంసం చేసినవారిపై కేసు

■ శివ్వంపేట, డిసెంబర్ 13: మండలంలోని గుండ్లపల్లిలో సర్వే నంబర్ 19లో రెండో సీరియల్‌కు సంబంధించిన భూమిలో కొంత భాగాన్ని జర్నలిస్టులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు జర్నలిస్టులు స్థలాల చుట్టూ కడీలు వేయించారు. కాగా, దొంతి గ్రామానికి చెందిన చెరుకూరి సత్తయ్య, చెరుకూరి మంగమ్మ బుధవారం జర్నలిస్టుల స్థలం చుట్టూ పాతిన కడీలను ధ్వంసం చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్‌చారి ఫిర్యాదుతో ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికాంత్‌రావు వెల్లడించారు.

## యువకుడిని సన్మానించిన కలెక్టర్


శ్రీధర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

■ మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 13 : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్న శ్రీధర్ నిజాయితీని చాటుకున్నాడు. గత నెల 23న పట్టణంలోని ఎస్టీ బాలుర హాస్టల్ వద్ద సెల్‌ఫోన్ దొరికింది. దొరికిన ఫోన్‌ను కలెక్టరేట్‌లో అప్పగించడానికి వెళ్లాడు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్‌తోపాటు సిబ్బంది లేకపోవడంతో, 28న మరోసారి కలెక్టరేట్‌కు వచ్చినా, అధికారులు లేరు. శ్రీధర్ బుధవారం కలెక్టరేట్‌కు వచ్చి సెల్‌ఫోన్‌ను కలెక్టర్ రాజర్షిషాకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను సన్మానించారు. బాధితుడికి ఫోన్ అందజేయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.


మెదక్ మున్సిపాలిటీ : రగ్బీ క్రీడాకారులను అభినందిస్తున్న డీఈవో రాధాకిషన్


గురుకుల కళాశాలల అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థినులు

# కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

■ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్
■ రగ్బీ క్రీడాకారులకు అభినందన, సన్మానం

మెదక్ మున్సిపాలిటీ/ శివ్వంపేట/ రామాయంపేట, డిసెంబర్ 13 : ఈ నెల 10 నుంచి 12వ తేదీల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కేఎల్‌ఆర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల రగ్బీ క్రీడా పోటీల్లో మెదక్ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రగ్బీ క్రీడాకారు లతోపాటు కోచ్, ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అభిందించారు.

**డీఈవోకు ఉపాధ్యాయుల సన్మానం**

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 'విద్యావిధానం–మార్పులు, అభివృద్ధి' అనే అంశాలపై జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా డీఈవో రాధాకిషన్ మాట్లాడి కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అందుకున్నారు. ఈ మేరకు డీఈవోను శివ్వంపేట మండలానికి చెందిన ఉపాధ్యాయులు సన్మానించారు. ముందుగా శివ్వంపేట జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ కాం ప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈవో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, మంచి పదాలతో మాట్లాడడం, క్రమశిక్షణ నేర్పించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏఎంవో సుదర్శన మూర్తి, హెచ్‌ఎం సునంద, సీఆర్‌పీ రవీందర్ పాల్గొన్నారు.

**ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టాలి : ఎంఈవో నీలకంఠం**

విద్యార్థులను ఉత్తమ పౌరులగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లపై ఉందని ఎంఈవో నీలకంఠం అన్నారు. రామాయంపేట, లక్ష్మాపూర్, అక్కన్నపేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఎంఈవో నీలకంఠం మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి, ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసనాన్ని పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పథకాలు –వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రామాయంపేట, లక్ష్మాపూర్, అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**టీచర్ల సమస్యలను పరిష్కరించాలి**

★ టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్

కాంగ్రెస్ ప్రభుత్వం టీచర్ల సమస్యలను పరిష్కరించాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ కోరారు. రామాయంపేటలో ఉపాధ్యాయుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర కౌన్సిల్ ఐరేని రవీందర్‌గౌడ్, అదనపు ప్రధాన కార్యదర్శి దేశపతి మోహన్, నాయకులు రాజేందర్, నవీన్, రత్నాకర్, విఠల్, శేఖర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో సాధించాలనే తపన ఉండాలి**

★ గురుకుల కళాశాలల అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్‌కుమార్ యాదవ్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 13 : కృషి, పట్టుదలతో ఎంతటి విజయాన్ని అయిన సాధించవచ్చని గురుకుల కళాశాలల అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్‌కుమార్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అనుకున్నది సాధించాలనే తపనతో ముందుకెళ్లాలని సూచించారు. సదస్సులో వివిధ రంగాల్లో లభిస్తున్న ఉద్యోగ అవకాశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసంతిపిళ్లై, వైస్ ప్రిన్సిపాల్ సుస్మిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు ఇవ్వాలి

■ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలి
■ మహాలక్ష్మి పథకంతో మహిళలకు మేలు
■ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి, డిసెంబర్ 13 : ఏన్నో ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ స్వరూప అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఎంపీపీ స్వరూప మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలన్నారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెల్దుర్తి నుంచి అన్ని గ్రామాలకు వెళ్లేలా బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏవో ఝాన్సీ మాట్లాడుతూ.. యాసంగి సాగుకు సంబంధించిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి పంటల సాగు వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పశువుల దవాఖానలో నీటి సౌకర్యం కల్పించాలని పశువైద్యాధికారి రేఖ సమావేశం దృష్టికి తెచ్చారు. తొమ్మిది గ్రామపంచాయతీ భవనాలు మంజూరు కాగా, నాలుగు భవనాల పనులు జరుగుతున్నాయని, మరో ఐదు భవనాల పనులు త్వరలోనే ప్రారంభిస్తామని పీఆర్ ఏఈ జుంకీలాల్ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఎంపీవో విఘ్నేశ్వర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్వోబీ నిర్మించాలి

★ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వినతి



చేగుంట, డిసెంబర్ 13 : చేగుంటలో రైల్వే బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవును బుధవారం మెదక్ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఎంపీగా పనిచేసిన కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ముందుగా కేంద్ర మంత్రులను కలిసి మెదక్ పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అందులో భాగంగా మెదక్ రైల్వే క్రాసింగ్ 228 వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కోరారు. మెదక్– చేగుంట రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు.

# రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

■ కిష్టాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేశంగౌడ్


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న కిష్టాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేశం

కొల్చారం, డిసెంబర్ 13 : మండలంలోని కిష్టాపూర్ పీఏసీఎస్‌లో స్వల్ప, దీర్ఘకాలిక వ్యవధిపై రుణాలు ఇస్తున్నట్లు సొసైటీ చైర్మన్ మల్లేశంగౌడ్ తెలిపారు. వడ్ల వెంకటేశం అనే రైతుకు దీర్ఘకాలిక రుణంగా రూ.5లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మల్లేశంగౌడ్.. కిష్టాపూర్ సొసైటీలో రైతులకు రుణాలు ఇస్తున్నామని, రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంభోజిపల్లి డీసీసీబీ మేనేజర్ సౌజన్యంతో వడ్ల వెంకటేశానికి రుణం అందజేసినట్లు తెలిపారు. కిష్టాపూర్ సొసైటీ నుంచి రైతులకు షీఫామ్స్, డెయిరీ ఫామ్, కోళ్లఫారం, వ్యాపార రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చాకలి ప్రభాకర్, సీఈవో నవీన్‌కుమార్, డైరెక్టర్లు సత్యనారాయణ, శేఖర్, ప్రమీల, రాజాగౌడ్, అందుగులపల్లి శ్రీరాములు, సిబ్బంది యాదగిరి పాల్గొన్నారు.


చందంపేటలోని పెద్దమ్మతల్లి ఆలయం

నేటి నుంచి చందంపేటలో

## పెద్దమ్మతల్లి ఉత్సవాలు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 13: మండలంలోని చందంపేటలో పెద్దమ్మతల్లి ఆలయ పంచమ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఈ నెల 14 నుంచి 17 వరకు 4 రోజులపాటు ఆలయ ఉత్సవాలు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 14న అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, బోనాల ఊరేగింపు, 15న హోమం, మహాపూర్ణాహుతి, పెద్దమ్మతల్లి కల్యాణం, బండ్ల ఊరేగింపు, బోనాల సమర్పణ, 16న బండ్లు, జలపందిరి ఊరేగింపు, అన్నదానంనిర్వహిస్తున్నారు. వార్షికోత్సవాలకు ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.